
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.15
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.8 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 1,800 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం 35.2°/20.8°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్ సీపీ 'చలో మెడికల్ కాలేజీ'



పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన 10 కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించేందుకు సిద్ధమైన కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ ఆ పార్టీ పోరుబాటకు సిద్ధమైంది. వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ (శుక్రవారం) 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమం నిర్వహిస్తోంది. పెనుకొండలోని మెడికల్ కళాశాల వద్ద చేపట్టనున్న కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్, రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమరనాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమం ద్వారా మెడికల్ కళాశాలలకు సంబంధించిన పూర్తి వాస్తవాలు ప్రజలకు వివరిస్తామన్నారు.

మానవ మనుగడకు మార్గదర్శకుడు విశ్వకర్మ

- జయంతి వేడుకల్లో జేసీ అభిషేక్ కుమార్



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: మానవ మనుగడకు మార్గదర్శకుడు విశ్వకర్మ అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేసీ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ, ప్రపంచ తొలి వాస్తు శిల్పి, సృష్టికర్తగా ప్రవచనకారులు విశ్వకర్మను ప్రస్తావిస్తారన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని అధికారికంగా జరుపుతున్నాయన్నారు. కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఈ క్రమంలోనే విశ్వకర్మ ఉప సమూహాలైన కమ్మరి, వడ్రంగి, కాంస్య కమ్మరులు, శిల్పులు, స్వర్ణకారులు తదితర కులవృత్తుల వారికి అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం 'విశ్వకర్మ యోజన' పథకం కింద రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తోందన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర కుమార్‌రెడ్డి, డీఎస్‌డీఓ ఉదయభాస్కర్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఏడాదిన్నరగా జిల్లాలో అదుపు తప్పిన శాంతి భద్రతలు
- విచ్చలవిడిగా హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు
- వీధి వీధినా బెల్టు షాపులు.. ఏరులై పారుతోన్న మద్యం
- పేకాట, లాటరీ, బెట్టింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు
- అన్నీ తెలిసీ కళ్లుమూసుకున్న పోలీసు యంత్రాంగం
- నూతన ఎస్పీ కట్టడి చేస్తారని ఆశపడుతున్న జనం

అత్యాచారాలు, అరాచకాలు.. భూకబ్జాలు, దోపిడీలు, దౌర్జన్యాలు... జూదం, గంజాయి అక్రమ రవాణా, హత్యలు... ఇలా నిత్యం శ్రీసత్యసాయి జిల్లా వార్తల్లో నిలుస్తోంది. కంచెలా సమాజానికి కాపుకాయాల్సిన ఖాకీల్లోనూ కొందరు దారి తప్పారు. కూటమి నేతల కనుసన్నల్లో పనిచేస్తూ జనానికి మరింత నరకం చూపుతున్నారు. దీంతో జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వారంతా ఇటీవలే చార్జ్ తీసుకున్న కొత్త పోలీసు బాస్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఆయనైనా లాఠీ ఎత్తుతారా.. లేదా అందరిలాగే లైట్‌గా తీసుకుంటారా.. అన్న చర్చ సాగుతోంది.



లాఠీ తీస్తారా.. లైట్‌గా తీసుకుంటారా

కొత్త బాస్‌కు లెక్కలేనన్ని సవాళ్లు

జిల్లా నూతన పోలీస్ బాస్‌గా సతీష్ కుమార్ ఇటీవల బాధ్యతలు తీసుకున్నారు. ఆయన పనితీరు, చేసిన సంస్కరణల గురించి తెలుసుకున్న జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా అదుపుతప్పిన శాంతిభద్రతలను కట్టడి చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



సతీష్‌కుమార్, ఎస్పీ

సాక్షి, పుట్టపర్తి

ఏడాదిన్నర కాలంగా జిల్లాలో శాంతి భద్రతలు అదుపు తప్పాయి. ఏ గ్రామంలో చూసినా ఏదో ఘటన వెలుగు చూస్తోంది. అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సామాన్యులపై ప్రతాపం చూపుతున్నారు. నాయకుల అండ చూసుకుని రౌడీ గ్యాంగ్‌లు తెరపైకి వచ్చాయి. ప్రజలకు అండగా నిలిచి భద్రత కల్పించాల్సిన పోలీసులు చోద్యం చూస్తుండటంతో పోలీస్ వ్యవస్థపైనా ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది.

మత్తు.. జీవితాలు చిత్తు..

జిల్లాలోకి గంజాయి విచ్చలవిడిగా దిగుమతి అవుతోంది. వీధివీధినా మద్యం ఏరులై పారుతోంది. అరికట్టేనాథుడే లేకపోవడంతో ఎంతోమంది యువత చిన్న వయసులోనే మద్యానికి, గంజాయికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. మద్యం మత్తులో హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతూ కటకటాల పాలవుతున్నారు. జిల్లాలో జరిగిన చాలా భూ తగాదాలు, హత్యలు మద్యం మత్తులో చేసినట్లు తేలింది.

హిందూపురంలో అరాచకాల పర్వం..

నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలు వెలుగు చూశాయి. పోలీసుల తీరును అలుసుగా తీసుకున్న ఓ వ్యక్తి పక్కా ప్లాన్‌తో తూమకుంట ఎస్‌బీఐలో భారీ చోరీ చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఇక చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో ఇంట్లో ఉన్న అత్తా కోడలిపై కొందరు యువకులు గంజాయి మత్తులో సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. ఎన్నికల ఫలితాల తర్వాత హిందూపురంలో ఓ వ్యక్తిని హత్య చేశారు. ఇటీవల చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డిపై హత్యాయత్నం చేశారు. పుట్టపర్తిలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. ఆఖరికి పోలీసుల వాహనాలు సైతం చోరీలకు గురవుతుండటం గమనార్హం. శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ క్వార్టర్స్‌లో ఏకకాలంలో 9 బ్లాకుల్లో దొంగతనం జరగడం కలకలం రేపింది. అయినా పోలీసులు దొంగలను పట్టుకోలేకపోయారు.



పచ్చమూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన లింగమయ్య (ఫైల్)



తూమకుంట ఎస్‌బీఐలో జరిగిన చోరీని పరిశీలిస్తున్న బ్యాంకు, పోలీసు అధికారులు (ఫైల్)

రేషన్ మాఫియా కేరాఫ్ పెనుకొండ..

మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గం రేషన్ బియ్యం మాఫియాకు కేరాఫ్‌గా నిలిచింది. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో సోమందేపల్లికి చెందిన తెలుగు తమ్ముడు రామకృష్ణ రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ దందా అందరికీ తెలిసినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

పోలీసుల తీరుపైనా విమర్శలు..

జిల్లాలోని ఏ ఒక్క పోలీస్ సబ్ డివిజన్‌లో కూడా శాంతి భద్రతలు అదుపులో లేవు. పైగా పోలీసుల తీరుపైనే సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల మడకశిర సీఐ ఓ మహిళను వేధించిన కేసులో సస్పెండ్ అయ్యారు. అలాగే పట్నం ఎస్‌ఐ ఓ మహిళకు న్యూడ్ వీడియోకాల్స్ చేసి వేధించి ఉద్యోగం పోగొట్టుకున్నారు. ఇక సివిల్ పంచాయితీల్లోనూ తలదూరుస్తున్న పోలీసులు సెటిల్‌మెంట్లు చేస్తూ.. భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చాలా స్టేషన్‌లలో చోరీలు, హత్య కేసులు కూడా ఏడాదిగా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. బాధితులు మాత్రం రోజూ పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ధర్మవరంలో వడ్డీ వ్యాపారుల దందా..

మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం పట్టణంలో వడ్డీ వ్యాపారులు.. పేదల రక్తం పీలుస్తున్నారు. వారానికి రూ.100కు రూ.పది చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. సకాలంలో వడ్డీ చెల్లించలేని వారిపై దాడులకు తెగబడుతున్నారు. వడ్డీ వ్యాపారులపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గంలోని ముదిగుబ్బ గంజాయి అక్రమ సరఫరాకు కేంద్రంగా మారిందని సమాచారం. ఇలా నియోజకవర్గంలోని పలు మండలాల్లో మద్యం మత్తులో విచ్చలవిడిగా గొడవలు, తగాదాలు, హత్యలు వెలుగు చూస్తున్నాయి.

రామగిరిలో రాక్షస క్రీడలు..

పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి. ప్రజాప్రతినిధులకే భద్రత లేకుండా పోయింది. ఎంపీపీ ఎన్నికల కోసం వెళ్తున్న ఓ మహిళా ఎంపీటీసీ సభ్యురాలిని పోలీసుల సమక్షంలోనే టీడీపీ నేతలు కిడ్నాప్ చేయడం కలకలం రేగింది. పేదల భూముల కబ్జాకు అంతేలేకుండా పోయింది. ఇక రామగిరి మండలం పేరూరు పంచాయతీ ఏడుగుర్రాలపల్లి గ్రామంలో ఓ దళిత మైనర్ బాలికను కొందరు యువకులు బెదిరింపులకు పాల్పడి సామూహిక అత్యాచారం చేశారు. బాలిక ఇటీవలే ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడా అమ్మాయి అనాథగా ప్రభుత్వ ఆశ్రయంలో ఉంది. టీడీపీ అల్లరి మూకలు సాగించిన ఈ అరాచకం చూసి సభ్య సమాజమే సిగ్గుతో తలదించుకుంది. ఇక రామగిరి ఎంపీపీ ఎన్నిక సమయంలో లింగమయ్య హత్య రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. రామగిరిలో దౌర్జన్యాలు, దుర్మార్గాలను అడ్డుకోవాల్సిన ఎస్‌ఐ... టీడీపీకి అంటకాగుతూ సామాన్యులపై తన ప్రతాపం చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

తంచన్ జీతాలు ఉత్తిమాటే

- నెలన్నర దాటినా అందని వేతనాలు
- ముఖ్యమైన పండుగలు ఎలా చేసుకునేది?
- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎదురుచూపు

'ఈ ప్రభుత్వంలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెల నెలా సక్రమంగా జీతాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికీ ఠంచన్‌గా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తాం'

– ఇదీ ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు ఇచ్చిన హామీ.

అనంతపురం ఎడ్యుకేషన్: సెప్టెంబరు నెల ప్రారంభమై నేటికి 18 రోజులు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్ష పరిధిలో ని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేటికీ ఆగస్టు నెల జీతం పడలేదు. ఎప్పుడొస్తుందో అధికారులకూ స్పష్టత లేదు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఇంకా బడ్జెట్ రాలేదు. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా జీతాల చెల్లింపు అనేది ఉత్తి మాటగానే మారింది.

పండుగల వేళ ఆందోళన

హిందువుల అతి పెద్ద పండుగల్లో ఒక్కటైన విజయదశమి దగ్గర పడుతుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. చాలామంది పెద్దల అమావాస్య (మహాలయ అమావాస్య) చేసుకుంటారు. పితృపక్షంలో పెద్దలకు కొత్త దుస్తులు పెట్టడం ఆనవాయితీ. మరో మూడు రోజుల్లో (ఈ నెల 21) పెద్దల అమావాస్య వస్తుంది. అసలే చిరుద్యోగుల నెలవారి వేతనాలు కుటుంబ నిర్వహణకే సరిపోతాయి. అలాంటిది ఇప్పటిదాకా జీతాలు రాకపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక పండుగ ఎలా చేయాలో దిక్కుతెలీక తలలు పట్టుకుంటున్నారు. మరో 13 రోజుల్లో (అక్టోబరు 2న) విజయదశమి పండుగ ఉంటుంది. ఇంటిల్లిపాది కొత్త దుస్తులు తెచ్చుకోవడం ఆనవాయితీ.

మూడు వేలమంది నిరీక్షణ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతం కోసం ఎదురు చూస్తున్నారు. కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలు, కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, అటెండర్లు, అకౌంటెంట్లు, వాచ్‌మెన్లు, కుక్‌లు, ఏఎన్‌ఎంలు, ఎమ్మార్సీల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్టులు, ఆయాలు, సమగ్ర శిక్ష కార్యాలయంలో డేటా అనలసిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు, సైట్ ఇంజినీర్లు, డీఎల్‌ఎంటీలు పని చేస్తున్నారు. వీరంతా జీతాలు పడకపోవడంతో పెద్ద పండగకు దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ఆగస్టు నెల జీతాలకు సంబంధించిన బడ్జెట్ రాలేదని సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు. ఇప్పటిదాకా కనీస సమాచారం లేదంటున్నారు.

16 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లాలోని 16 మండలాల్లో వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ సగటున 9.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా చిలమత్తూరు మండలంలో 46.4 మి.మీ, పుట్టపర్తి మండలంలో 40 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక పరిగి మండలంలో 35.4 మి.మీ, అమడగూరు 30.6, అగళి 29.2, మడకశిర 26.8, రొళ్ల 18.2, సోమందేపల్లి 17.0 , గోరంట్ల 15.2, పెనుకొండ 12.8, తాడిమర్రి 10.2, హిందూపురం 9.8, తనకల్లు 4.8, గుడిబండ 3.4, అమరాపురం 3.0, ఓడీచెరువు మండలంలో 1.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. జిల్లాకు మరో రెండు రోజులు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

బీజేపీ నాయకుడి ఆత్మహత్యాయత్నం

- స్టేషన్ ఎదుటే ఒంటిపై డీజిల్ పోసుకున్న బాధితుడు
- సీఐ శేఖర్, పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆవేదన

గోరంట్ల: ఓ కేసు విషయంలో గోరంట్ల సీఐ శేఖర్‌తో పాటు సిబ్బంది తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపిస్తూ గోరంట్లకు చెందిన దేవాంగం నరేష్ బుధవారం సాయంత్రం పోలీసుస్టేషన్ ఎదుటే ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు నరేష్ తెలిపిన వివరాల మేరకు.. గోరంట్లకు చెందిన దేవాంగం నరేష్ బీజేపీ నాయకుడు. అతను ఓ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. దీంతో బుధవారం ఉదయం సీఐ శేఖర్ అతన్ని, అతని సోదరుడైన మహేష్‌ను స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం సీఐ శేఖర్ ఆదేశాలతో ఇద్దరు కానిస్టేబుళ్లు అన్నదమ్ములిద్దరినీ చిత్రహింసలకు గురి చేశారు. అలాగే వారి కుటుంబీకులను అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో మనస్తాపం చెందిన దేవాంగం నరేష్ సాయంత్రం పోలీసు స్టేషన్ ఎదుటే ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన ఎస్‌ఐ రామచంద్ర, పోలీసులు అతన్ని నిలువరించి కాపాడారు. తాను తప్పుచేసి ఉంటే కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచాలని, ఇలా థర్డ్ డిగ్రీ ప్రయోగించే అధికారం సీఐకి ఎవరిచ్చారని నరేష్ ప్రశ్నించారు.



ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకోవడంతో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న నరేష్

రౌడీషీటర్లు.. ఇందుకే కౌన్సెలింగ్ ఇచ్చాం..

ఈ విషయమై సీఐ శేఖర్‌ను వివరణ కోరగా... నరేష్‌తో పాటు అతని సోదరుడు మహేష్‌పై గోరంట్ల పోలీసు స్టేషన్‌లో 2014లో రౌడీషీట్ ఓపెన్ అయ్యిందని, అదేవిధంగా 2025 జూన్ 17వ తేదీన ఆర్‌అండ్‌బీ ప్రహరీని జేసీబీలతో కూల్చిన కేసుతోపాటు అదేరోజు మరో కేసు కూడా నమోదైందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గకుండా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నరేష్‌తో పాటు అతని సోదరుడు మహేష్‌ను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులను బెదిరించడంతో పాటు స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన నరేష్‌పై తాజాగా మరో కేసు నమోదు చేశామన్నారు.

➢ కదిరి జీవిమాను కూడలిలో ఈ నెల 7వ తేదీన అఫ్రిన్ అనే ఐదేళ్ల చిన్నారిని వీధి కుక్క కరిచి తీవ్రంగా గాయపరచింది. కుటుంబీకులు చిన్నారిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుడి సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. అంతకుముందు అడపాల వీధిలో ఒకేరోజు రాత్రి వేళ కుక్కలు 17 మంది చిన్నారులతో పాటు మరో మహిళను కూడా తీవ్రంగా గాయపరిచాయి.

➢ హిందూపురం మోడల్ కాలనీలో ఇటీవల వీధి కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. పట్టణంలో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. పెనుకొండలోనూ వీధి కుక్కలు పెరిగిపోగా, ఇటీవల కుక్కకాటు బాధితుల సంఖ్య భారీగా పెరిగింది.

...ఇలా జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ఒంటిరిగా వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. ఇటీవల కుక్కకాటు బాధితులు సంఖ్య భారీగా పెరగుతుండగా..ఆస్పత్రుల్లో రేబీస్ వ్యాక్సిన్ అరకొరగా ఉంటోంది.

కుక్కలు కొరికేస్తున్నాయ్

- వీధుల్లోకి రావాలంటేనే భయపడుతున్న జనం
- బైక్‌పై వెళ్తున్నా తప్పని కుక్క కాటు
- 8 నెలల్లోనే 2,406 కేసుల నమోదు
- అనధికారికంగా ఈ లెక్క మరింత ఎక్కువే
- పశువులనూ వదిలి పెట్టని గ్రామ సింహాలు
- రేబిస్ టీకాల సరఫరా అంతంత మాత్రమే

భౌ.. బాబోయ్!

కదిరి: జిల్లాలో శునకాల సంతతి ఇటీవల బాగా పెరిగింది. జిల్లాలోని ఏ వీధిలో చూసినా కుక్కల మందలే కనిపిస్తున్నాయి. ఇలా వీధుల్లో తిష్టవేస్తున్న శునకాలు దారి వెంట వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో బైక్‌ల వెంట బడుతూ తీవ్రంగా భయపెడుతున్నాయి. జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట...ఎవరో ఒకరు కుక్కకాటుకు గురవుతున్నారు. ముఖ్యంగా కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డు పక్కన పడేయటంతో పదుల సంఖ్యలో కుక్కలు చేరి, పోట్లాడుకొని ఆఖరకు అడ్డొచ్చిన జనాన్ని కరుస్తున్నాయి. గత 8 నెలల కాలంలోనే జిల్లా వ్యాప్తంగా 2,406 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ఇక నమోదు కాని కేసులు మరో 1,000 దాకా ఉండచ్చని అధికారులే చెబుతున్నారు. ఇక మూగ జీవాలను కూడా కుక్కలు వదలడం లేదు.



కదిరిలో సంచరిస్తున్న వీధి కుక్కలు

జిల్లాలో 1.60 లక్షల శునకాలు

పెంపుడు కుక్కల వివరాలను ఆయా మున్సిపాలిటీల్లో నమోదు చేయించాల్సి ఉన్నా.. జిల్లాలో ఎక్కడా నమోదు చేయడం లేదు. ఇక వీధి కుక్కల సంఖ్య ఎంత ఉందని చెప్పడం కూడా కష్టమేనని సంబంధిత అధికారులే చెబుతున్నారు. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లో 1,484 పెంపుడు కుక్కలు, 27,099 వీధి కుక్కలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటికి తోడు మండలాల పరిధిలోని గ్రామాల్లోని కుక్కలను సైతం లెక్కిస్తే జిల్లా వ్యాప్తంగా సుమారు 1.60 లక్షల పెంపుడు, వీధి కుక్కలు ఉండచ్చని తెలుస్తోంది.

నిధుల కొరతతో కు.నికి పాట్లు

కుక్కల్ని చంపడానికి నిబంధనలు ఒప్పుకోవు. అందుకే స్టెరిలైజేషన్ (ఆపరేషన్) చేసి వాటి సంతతిని తగ్గిస్తారు. కానీ జిల్లాలో ప్రస్తుతం ఈ ప్రక్రియ సాగడం లేదు. కూటమి ప్రభుత్వంలో కుక్కల నియంత్రణకు నిధుల కొరత ఉందని ఆయా మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో కుక్కకు కు.ని శస్త్ర చికిత్స చేయాలంటే రూ.500 ఖర్చు అవుతుందంటున్నారు. ఈ లెక్కన కోట్లలోనే ఖర్చు చేయాల్సి ఉంటుందని వారంటున్నారు. ఇక పంచాయతీల పరిధిలో కుక్కలకు కు.ని ఆపరేషన్ల సంగతి చెప్పనక్కర లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కుక్కల స్టెరిలైజేషన్ కోసం నిధులు విడుదల చేసిన దాఖలాల్లేవు.

జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల పరిధిలో కుక్కల వివరాలు ఇలా..

మున్సిపాలిటీ	పెంపుడు కుక్కలు	వీధి కుక్కలు
కదిరి	307	5,705
ధర్మవరం	413	7,650
పుట్టపర్తి	109	1,609
మడకశిర	135	2,060
హిందూపురం	412	8,850
పెనుకొండ	108	1,225
మొత్తం	1,484	27,099

రేబిస్ వ్యాక్సిన్‌కూ దిక్కులేదు

కుక్కకాటు బాధిత సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా.. జిల్లా కుక్కకాటుకు వేసే రేబిస్ వ్యాక్సిన్ కొరత వేధిస్తోంది. చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క కాటుకు మందులు లేవని వైద్యులే చెబుతున్నారు. ఇక సీహెచ్‌సీలు, పట్టణాల్లోని ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ అంతమాత్రంగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో చాలా మంది పురాతన పద్ధతులైన వాతలు పెట్టుకోవడం...పసరు తాగడం చేస్తున్నారు. కానీ కుక్కకాటు బాధితులు సకాలంలో వ్యాక్సిన్ వేసుకోకపోతే ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదమని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

కుక్కలను అలా వదిలేస్తే ఎలా?



కూటమి ప్రభుత్వం కుక్కలను చాలా తక్కువగా అంచనా వేస్తోంది. ఎంతో మంది పిల్లలను కరిచినా పట్టించుకోవడం లేదు. ఎక్కడచూసినా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లోకి రావాలంటేనే పెద్దలే భయపడుతున్నారు. ఇక పిల్లల సంగతి చెప్పనక్కర లేదు. కూటమి నేతల పిక్కలు పట్టుకుంటేగానీ ఈ ప్రభుత్వంలో చలనం వచ్చేటట్లు లేదు.

– ఎంఐఎం అక్బర్, కదిరి

రేబిస్ సోకే ప్రమాదం



కరచిన కుక్కకు రేబిస్ వ్యాధి ఉంటే ఆ వ్యాధి మనకు సోకే ప్రమాదం ఉంది. అందుకే కుక్క కరచిన వెంటనే యాంటి రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కోర్సు మేరకు 5 నుంచి 7 వ్యాక్సిన్లు వేస్తారు. కుక్కకాటుకు గురైన వ్యక్తి నీళ్లు తాగాలన్నా, నీటి శబ్దానికి భయం పడినా... జ్వరం తదితర అనారోగ్య లక్షణాలున్నా రేబీస్ వ్యాధిగా పరిగణించాలి.

–డా.ఫైరోజ్‌బేగం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి

క్లుప్తంగా

గర్వించేలా విద్య నేర్వాలి

- టేకులోడు ఎంజేపీ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ సూచన



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

చిలమత్తూరు: జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్య నేర్పిన గురువులు గర్వించేలా ప్రతి విద్యార్థీ బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం చిలమత్తూరు మండలం టేకులోడు క్రాస్‌లో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాల, విద్యార్థుల భోజన గది, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలు, విద్యాబోధన తదితర అంశాలపై విద్యార్థులతో ఆరా తీశారు. 1,100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ



పుట్టపర్తి టౌన్: జిల్లాలో దరఖాస్తు చేసుకున్న మూడు మద్యం దుకాణాలకు గురువారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెలలో 12 బార్ల నిర్వహణకు టెండర్లు పిలవగా ఏడింటికి మాత్రమే దరఖాస్తులు అందాయి. వీటికి లాటరీ పద్ధతిలో అర్హులను ఎంపిక చేశారు. మిగిలిన 5 బార్లకు మరోమారు పలు దఫాలుగా నోటిఫికేషన్ జారీ చేశారు. గడువు ముగిసే సమయానికి మడకశిర, కదిరి, హిందూపురంలోని బార్లకు 12 దరఖాస్తులు అందాయి. ధర్మవరంలో రెండు దుకాణాలకు దరఖాస్తులు అందలేదు. దరఖాస్తులు అందిన మూడు బార్లకు గురువారం ఉదయం లాటరీ నిర్వహించనున్నారు.

వణికిస్తున్న జ్వరాలు



ఊరూరా జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులే కాదు ఆర్‌ఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలకు బాధితులు పోటెత్తుతున్నారు. ఏ ఆస్పత్రి చూసినా కిక్కిరిసి ఉన్నాయి. మొన్నటికి మొన్న ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలంలో ఒకే ఇంట్లో ముగ్గురు పిల్లలు డెంగీ బారిన పడటంతో బళ్లారి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. తాజాగా గుత్తి ఆర్‌ఎస్‌లో ఇద్దరు చిన్నారులు డెంగీ జ్వరంతో కోలుకోలేక ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేపుతోంది.



ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓపీ చికిత్సకు వచ్చిన రోగులు



హిందూపురంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి చిన్నపిల్లల విభాగంలోని ఓ వార్డులో కిక్కిరిసిన రోగులు

- ప్రతి ఆస్పత్రిలోనూ జ్వరపీడితులే
- తాజాగా గుత్తిలో ఇద్దరు చిన్నారులు డెంగీతో మృతి
- బాధితుల్లో ఐదేళ్లలోపు చిన్నారులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు
- ప్రైవేటు వైద్య ఖర్చుతో హడలిపోతున్న సామాన్యులు
- గడిచిన వారం రోజుల్లో 50వేల మందికి జ్వరాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వాస్పత్రులు జ్వరాల బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సగటున 40 నుంచి 50 మంది ఔట్‌పేషెంట్లు చికిత్సకు వస్తే అందులో 15 మంది వైరల్ జ్వరపీడితులే ఉంటున్నారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో రోజూ 250 మందికి పైగా జ్వరబాధితులు చికిత్సకు వస్తున్నారు. చాలామంది చలి జ్వరంతో నడవలేని స్థితిలో ఉంటున్నారు. అలాంటి వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందించాల్సిన పరిస్థితి వస్తోంది. పడకలు సరిపడక కొంతమంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు– చికిత్సల ఖర్చులు భారీగా ఉండటంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. గడిచిన వారం రోజుల్లోనే 50వేలమంది జ్వరాల బారిన పడినట్లు అంచనా. అందులోనూ చిన్నారులు కూడా జ్వరాలతో విలవిలలాడిపోతుండటం తల్లిదండ్రులను కలవరపెడుతోంది.

డెంగీతో ఇద్దరు చిన్నారుల మృతి

గుత్తి ఆర్‌ఎస్‌లో తాత వద్ద ఉంటూ చదువుకుంటున్న సంయుక్త అనే ఏడేళ్ల అమ్మాయి ఆరు రోజుల క్రితం డెంగీతో కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందింది. పాప తల్లిదండ్రులు ముదిగుబ్బలో నివాసం ఉంటారు. గుత్తికే చెందిన రెండేళ్ల హర్షిత్ అనే బాలుడు బుధవారం డెంగీతో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. కానీ అనంతపురం జిల్లాలో డెంగీ మరణాలు లేవని, ఇప్పటివరకూ 37 కేసులు మాత్రమే నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు.

సాధారణ ధరలు...ప్రైవేటు ఆస్పత్రులు తీసుకుంటున్నది

జ్వరం	టెస్టుకు అయ్యే ఖర్చు	వసూలు చేస్తున్నది
డెంగీ	రూ.750 (అన్ని టెస్టులు)	రూ.2వేల నుంచి రూ.3వేలు
టైఫాయిడ్ టెస్ట్‌కిట్	రూ.450 (వందమందికి చేయొచ్చు)	ఒక్కొక్కరినుంచి రూ.300
మలేరియా	రూ.150	రూ.400 నుంచి రూ.500
సీబీపీ	రూ.100	రూ.250 నుంచి రూ.300
ఇన్‌పేషెంటు	రూ.2 వేలు (రోజుకు)	రూ.4వేల నుంచి రూ.5వేలు
ఔట్‌పేషెంటు ఫీజు	రూ.200	రూ.500

మూడు రోజులుగా ఆస్పత్రిలోనే..



జ్వరంతో చికిత్స పొందుతున్న గంగోత్రి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్

నంబూలపూలకుంట మండలం తాటిమాను గుంత గ్రామానికి చెందిన గంగోత్రి, తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి చెందిన సతీష్‌కుమార్ గత మూడు రోజులుగా జ్వరం తో బాధపడుతూ కదిరిలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. అయినా జ్వర తీవ్రత తగ్గక పోవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



ధర్మవరం: డాక్టర్ వద్ద వైద్యం కోసం క్యూలో వేచి ఉన్న జ్వర పీడితులు

చిన్నారులతో ప్రైవేటు ఆస్పత్రుల రద్దీ

జ్వరాల బారిన పడుతున్న వారిలో ఎక్కువ మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉంటున్నారు. అనంతపురం సాయినగర్‌లోని ఓ చిన్నపిల్లల ప్రైవేటు ఆస్పత్రిలో జ్వరాలతో చేరిన చిన్నారులు భారీ సంఖ్యలో ఉన్నారు. ఒక్కో చిన్నారికి రూ.500 ఔట్‌పేషెంటు ఫీజు వసూలు చేస్తుండటంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్తపరీక్షలు, నెబులైజర్ల పేరిట రెండు మూడు రోజులకే రూ.15వేల వరకూ వసూలు చేస్తున్నట్టు వాపోతున్నారు.

వైద్య సేవల్లో లోపాలు తలెత్తరాదు

- స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ స్టేట్ నోడలాఫీసర్ అనిల్‌కుమార్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

పరిగి: మహిళలకు అందజేస్తున్న వైద్య సేవల్లో లోపాలు తలెత్తరాదని వైద్య, ఆరోగ్య సిబ్బందిని స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ స్టేట్ నోడలాఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పరిగిలోని పీహెచ్‌సీలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. మహిళల ఆరోగ్య భద్రత కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు హసీనాసుల్తానా, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, ఆర్‌ఐ సిద్దేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మహిళకూ వైద్య సేవలు అందాలి : జేసీ




పోస్టర్లు విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తదితరులు

పుట్టపర్తి అర్బన్: ప్రతి మహిళకూ వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగంతో కలసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, స్త్రీ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలన్నారు. అలాగే ఆభా కార్డులు (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్), పీఎంజేఏవై కార్డుల నమోదు ప్రక్రియ జరగాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డాక్టర్ నాగేంద్రకుమార్, డాక్టర్ సునీల్, ఎన్టీఆర్ వైద్య సేవ అధికారి డాక్టర్ శ్రీదేవి, డీపీహెచ్‌ఎన్‌ఓ వీరమ్మ, డెమో బాబాఫక్రుద్దీన్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల రోజుల పాటు 'పోషణ్ మహ'..

పోషకాహార ప్రాధాన్యతపై ప్రజలను చైతన్య పరిచాలని ఐసీడీఎస్ సిబ్బందిని జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. నెల రోజుల పాటు పోషన్ మహ కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ ప్రమీలతో కలసి బుధవారం పుట్టపర్తి మండలం ఎనుములపల్లి పీహెచ్‌సీ ప్రాంగణంలో పోషన్ మహ కార్యక్రమాలను ఆయన ప్రారంభించి, మొక్కనాటి నీరు పోశారు. మాతృవందన యోజనపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు పలు రకాల ఆహార పదార్థాలను తీసుకొచ్చి ప్రదర్శించారు. వాటిలోని పోషక విలువలను గర్భిణులకు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో గురుకుల విద్యార్థుల సత్తా



ట్రోఫీని అందుకుంటున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

రొళ్ల: తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్న జీసీసీ (గుమ్మడి క్రికెట్ గ్రౌండ్) వేదికగా స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 15, 16వ తేదీల్లో జరిగిన 6వ జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలో రొళ్ల మండలం దొమ్మరహట్టిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 15 మంది క్రీడాకారులున్న ఏపీ జట్టులో 9 మంది గురుకుల పాఠశాల విద్యార్థులే ఉండడం గమనార్హం. ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టుతో తలపడిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 113 పరుగులు చేసింది. తర్వాత బరిలో దిగిన తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 110 పరుగుల వద్ద చతికిలపడింది. 3 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు విజయం సాధించింది. ఆంధ్ర జట్టు తరపున విజేత ట్రోఫీని కెప్టెన్ మనోహర్, వైస్ కెప్టెన్ వరుణ్‌సందేష్ అందుకున్నారు. ప్రతిభ చాటిన గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం సాయంత్రం ఎంఈఓ శ్రీధర్, ప్రిన్సిపాల్ మైలారప్ప, చైర్మన్ సుమతో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

కట్టకిందపల్లిలో పట్టపగలే చోరీ

బత్తలపల్లి: మండలంలోని కట్టకిందపల్లిలో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన చల్లా రామానాయుడు ఇటీవల మృతి చెందాడు. ఆయన భార్య రామాంజినమ్మ ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. కుమారుడు రాజేష్ అనంతపురంలోని డ్రిప్ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రామాంజినమ్మ ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లింది. తాళం వేసిన ఇంటిని గమనించిన దుండగులు లోపలకు చొరబడి మూడు తులాల బంగారు నగలు, రూ.30 వేలు నగదు అపహరించారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న రామాంజినమ్మ చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

- ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సాయినగర్‌లో నివాసముంటున్న జాకీర్ హుస్సేన్ ఇంట్లో దుండగులు చొరబడి బంగారు నగలు, నగదు అపహరించారు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి జేకే పల్లిలోని బంధువుల ఇంటికి హుస్సేన్ వెళ్లాడు. బుధవారం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తాళం బద్దలుగొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించాడు. బీరువాలోని 8 తులాల బంగారు నగలు, రూ.50వేల నగదు అపహరించినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

తాడిమర్రి: మండలంలోని పుల్లంపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, ద్విచక్ర వాహనం పూర్తిగా కాలి బూడిదైంది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిమర్రిలోని బీసీ కాలనీకి చెందిన యువకులు ఆర్వేటి ఉమాశంకర్, పూజారప్ప మంగళవారం ద్విచక్ర వాహనంపై ఆర్వేటప్ప స్వామి గుడి నిర్మాణానికి చందాల కోసం ధర్మవరం సమీపంలోని పల్లెలకు వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణమై వారు పుల్లంపల్లి సమీపంలోకి చేరుకోగానే జేబులోని పేపర్లు కిందపడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనాన్ని వెనక్కి తిప్పుకుని వెళుతుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దినేని శ్రీధర్ నాయుడు ఢీకొన్నాడు. ప్రమాదంలో శ్రీధర్ నాయుడుకు కాలు విరిగింది. ఉమాశంకర్ ద్విచక్ర వాహనం పెట్రోలు ట్యాంక్ పేలి మంటలు ఎగిసి పడి వాహనం పూర్తిగా కాలిపోయింది. క్షతగాత్రుడిని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

25 నుంచి 'ఆంధ్రా యువ సంకల్ప్'

అనంతపురం కల్చరల్: ఈ నెల 25 నుంచి ఐదు రోజుల పాటు ఆంధ్రా యువ సంకల్ప్ 2కే25 పేరుతో డిజిటల్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యువజన సంక్షేమ అధికారి కార్యాలయం బుధవారం ఓ ప్రకటన జారీ చేసింది. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న వారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ భాగస్వాములు కావచ్చు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.75వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. అలాగే మరో 9 మంది విజేతలకు ప్రశంసాపత్రాలను అందించి సత్కరిస్తారు. పూర్తి సమాచారానికి https://andhrayuvasankalp.com వెబ్‌సైట్‌ను పరిశీలించాలి.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



పెనుకొండలో మెడికల్ కళాశాల నిర్మాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

పెనుకొండ: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం సరికాదని కూటమి ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ సూచించారు. పెనుకొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను బుధవారం సీపీఎం నాయకులతో కలసి ఆయన పరిశీలించి, మాట్లాడారు. వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించాలనుకోవడం అవివేకమన్నారు. 2023లో గత ప్రభుత్వం పెనుకొండలో వైద్య కళాశాల భవన నిర్మాణాలను చేపట్టి రూ. 30 కోట్ల మేర ఖర్చు పెట్టిందని, ఇలాంటి తరుణంలో ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతమైన పెనుకొండలో సత్వరం మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పెనుకొండలో మెడికల్ కళాశాల ఏర్పాటైతే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఇది పేద మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఉపయోగకరమన్నారు. అదే ప్రైవేట్ పరమైతే ఫీజుల భారం పడుతుందన్నారు. వైద్య సేవలు అత్యంత ఖరీదుతో కూడుకుంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను వీడి ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంగాధర్, వెంకటరాముడు, సీఐటీయూ జిల్లా నాయకుడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, కార్యదర్శులు లక్ష్మీరాజా, శెట్టిపి జయచంద్రారెడ్డి అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ యూటీఎఫ్ చేపట్టిన రణభేరి కార్యక్రమం కర్నూలు, అనంతపురం జిల్లాల మీదుగా బుధవారం పెనుకొండకు చేరింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌తో కలసి యూటీఎఫ్ నాయకులు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఒకటిన్నర ఏడాదిగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. పీఆర్‌సీని నియమించడంతో పాటు 30 శాతం ఐఆర్‌ను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు డీఏలు, రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిలు, 11వ పీఆర్‌సీ, అరియర్స్, పీఎఫ్ చెల్లింపులు చేయాలన్నారు. ఈ నెల 25న గుంటూరులో తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నారాయణస్వామి, నబీ, నరేష్, భూతన్న, జీహెచ్ బాబు, మారుతి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నరసింహప్ప, మహంతేష్, రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మలేషియా భక్తులు

అలరించిన మలేషియా భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న మలేషియా భక్తులు బుధవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



పి బ్యాడగెర రైతు సేవా కేంద్రం వద్ద రైతుల ఆందోళన

అగళి: యూరియా కోసం మండల పరిధిలోని పి.బ్యాడగేరలో బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం పి.బ్యాడగెర రైతు సేవా కేంద్రానికి 280 బస్తాలు యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు 500 మంది రైతులు ఉదయమే సేవా కేంద్రం ఎదుట బారులు తీరారు. గంటల తరబడి ఓపిగ్గా నిల్చున్నా.. అధికారులు ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. అయినా కూడా చాలా మంది రైతులకు యూరియా అందలేదు. దీంతో వారంతా ఆందోళనకు దిదారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని కూటమి సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.